క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి వెంటనే పరిష్కరించారు. మరికొన్ని వినతులను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

బహుముఖ నైపుణ్యాలతో రాణించాలి



డ్యాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థినులు

సీతంపేట: పోటీ ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యార్థులు బహుముఖ నైపుణ్యాలతో రాణించాలని ఆచార్య పి.ఎస్.అవధాని అన్నారు. అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాలలో శనివారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని స్టూడెంట్లకు సూచించారు. ఈ సందర్భంగా 8, 9 తరగతుల విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయినులు, మహిళా సిబ్బందిని సత్కరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.వి.వి.సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఎస్.ఎల్.శైలజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వంకాయల సన్యాసిరాజు, రమేష్‌చంద్ జైన్, ఎం.వి.రాజశేఖర్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్ ఆక్రమణపై స్థానికుల ఆందోళన



జాతీయ రహదారి పక్కన గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో నిర్మిస్తున్న రోడ్డు

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మద్రిపాలెం జాతీయ రహదారి పక్కనే ఉన్న గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమించి రోడ్డు నిర్మిస్తున్నారని పలువురు స్థానికు లు ఆరోపిస్తున్నారు. ఓ వాహనాల షోరూమ్‌కు సంబంధించి రోడ్డు వేస్తున్నారని చెబుతున్నారు. గతంలో కూడా ఇలాగే చేస్తే అప్పుడు కూడా పలువురు అడ్డుకుని ఆందోళన చేపట్టడంతో వెనుదిరిగారని గుర్తుచేశారు. మళ్లీ ఇప్పుడు రోడ్డు నిర్మించడం తగదని, టౌన్ ప్లానింగ్ అధికారులు, హార్టీకల్చర్ అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

ఎర్రిగెడ్డ కన్వేయర్ బెల్ట్ ప్రారంభం

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి ఎర్రిగెడ్డ ఆర్ అండ్ డీ యార్డ్ వద్ద సుమారు రూ.1.89 కోట్లతో నిర్మించిన కన్వేయర్ బెల్ట్‌ను శనివారం జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, 41వ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ప్రారంభించారు. కార్యక్రమంలో జోన్-5 ఇంజినీరింగ్ ఈఈ ప్రసన్నరెడ్డి, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అర్బన్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్, వేళంగిణిరావు, కుమార్, అన్నపూర్ణ, దేవి, సురేష్‌కుమార్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ ప్రభుదాస్, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

మహర్దశ

- 14వ వార్డులో ప్రగతి పరుగులు
- రూ.17 కోట్లతో అనేక అభివృద్ధి పనులు
- వార్డు ప్రజల హర్షాతిరేకాలు



గణేష్‌నగర్‌లో నిర్మించిన వార్డు సచివాలయం (నరసింహనగర్-1)



మెరిసిపోతున్న విద్యుత్‌నగర్ రోడ్డు



సుందరంగా రాధాకృష్ణా లేఅవుట్ - నరసింహనగర్ రహదారి



నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో నిర్మించిన ఫుట్‌పాత్

14వ వార్డులో చేపట్టిన పనులు

- రూ.7 కోట్లతో రహదారుల నిర్మాణం
- రూ.5.50 కోట్లతో డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణం
- రూ.2.5 కోట్లతో పార్కుల ఆధునికీకరణ
- రూ.55 లక్షలతో సచివాలయాల అభివృద్ధి
- రూ.1.70 లక్షలతో ఫుట్‌పాత్‌ల నిర్మాణం

సీతమ్మధార: జీవీఎంసీ జోన్-3 పరిధిలోని 14వ వార్డులో అభివృద్ధి పథంలో పరుగులు తీస్తోంది. వార్డుకు వన్నె తెచ్చేలా పచ్చని పార్కులు, అందమైన రోడ్లు, సచివాలయ భవనాలు, కాలువలు, డ్రెయిన్లు నిర్మించారు. విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. సుమారు రూ.17 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. గత ప్రభుత్వంలో ఇక్కడి రోడ్లు గోతులతో నిండి అధ్వానంగా తయారయ్యాయి. సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ నుంచి మాధవధారకు వెళ్లే మార్గం గుంతలమయంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14వ వార్డుకు మహర్దశ పట్టింది. వార్డులో సుమారు రూ.7 కోట్లతో అందమైన రహదారులు నిర్మించారు. డ్రైనేజీలు, కల్వర్టులను ఆధునికీకరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు వాటిని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు దృష్టికి తీసుకెళ్లి.. అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దీంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.2.5 కోట్లతో స్నేపర్ పార్కు

సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో రూ.2.5 కోట్లతో సుందరమైన స్నేపర్ పార్కు నిర్మించారు. వాకింగ్ ట్రాక్‌లు, సీతాకోకచిలుకల ఉత్పత్తి కేంద్రం, పిల్లలు ఆట స్థలం, వర్షం ఆశ్రయాలు, పెర్గోలా, లిల్లీపాండ్, పెవిలియన్, టాయిలెట్స్, గెజిబో, ధ్యాన, యోగా కేంద్రాలు వంటి ఆధునిక సౌకర్యాలు కల్పించారు. వీటితోపాటు యాంపీ థియేటర్, నీటి సరఫరా, బిందు సేద్యం వ్యవస్థ ఏర్పాటు చేశారు.

కొండవాలులో వాటర్ ట్యాంకులు

సీతమ్మధార కొండవాలు ప్రాంతం ఏఎస్సార్ నగర్, బిలాల్ కాలనీల్లో రూ.5 లక్షలతో తాగునీటి ట్యాంకులు, భారీ పైప్‌లైన్ ఏర్పాటు చేసి నివాసుల నీటి కష్టాలను తొలగించారు.

ఇది కదా అభివృద్ధి



నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ఆధునిక హంగులతో నిర్మించిన స్నేపర్ పార్కు

అభివృద్ధి పనులు.. నిధులు

- 14వ వార్డు గణేష్‌నగర్‌లో రూ.35 లక్షలతో నరసింహనగర్-1 సచివాలయ(1086251) భవనం నిర్మించారు.
- బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో రూ.15 లక్షలతో రోడ్డు నిర్మించారు.
- బాలయ్యశాస్త్రి లేఅవుట్ నుంచి రాధాకృష్ణ లేఅవుట్ వరకు రూ.4 లక్షలతో రహదారి నిర్మించారు.
- నరసింహనగర్ నుంచి గణేష్‌నగర్ వరకు రూ.48.80 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టారు.
- రూ.14.65 లక్షలతో పలు రహదారులను అభివృద్ధి చేశారు.
- రూ.11.81 లక్షలతో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు.
- రూ.1.58 లక్షలతో హిల్ పార్కు కాంపౌండ్ పనులు చేపట్టారు.
- నరసింహనగర్‌లో రూ.20 లక్షలతో సర్వీస్ రోడ్డు నిర్మించారు.
- ఎస్ఆర్ఐ హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో రూ.19.80 లక్షలతో సర్వీస్ రోడ్లు నిర్మించారు.
- రూ.10 లక్షలతో ఎస్ఆర్ఐ హాస్పిటల్ ప్రాంతంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు.
- గణేష్‌నగర్‌లో రూ.9 లక్షలతో సీసీ రోడ్లు, రూ.28 లక్షలతో సర్వీస్ రోడ్లు నిర్మించారు.
- నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో రూ.8 లక్షలతో సర్వీస్ రోడ్డు పనులు చేపట్టారు.
- రూ.66 లక్షలతో విద్యుత్ నగర్ ప్రధాన రహదారిలో టవర్స్ నిర్మించారు.
- బిలాల్ కాలనీలో రూ.12 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు.

రహదారులు మెరిసిపోతున్నాయి



జీవీఎంసీ 14వ వార్డులో నిర్మించిన రోడ్లు అద్దంలా మెరిసిపోతున్నాయి. గతంలో గోతులతో ఉండేవి. నేడు రహదారులను అభివృద్ధి చేయడంతో వాహన చోదకులు, పాదచారులకు ఇబ్బంది లేకుండా ప్రయాణిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రహదారులు బాగుపడ్డాయి.
– టి.నవీన్‌రాజ్, బాలయ్యశాస్త్రి లేఅవుట్

రజకుల సంక్షేమానికి అనేక పథకాలు



మాట్లాడుతున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రజకుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తర పార్టీ కార్యాలయంలో శనివారం రజక సోదరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ గెలుపునకు సహకరించాలని కోరారు. రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను గెలిపించుకోవాలన్నారు. రజకులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, కోడూరి సత్యనారాయణ, సత్యరాజులు, జయనాథ్, పి.రామ్మోహనరావు, పెట్టయ్య, సిహెచ్.అప్పారావు, పి. అప్పారావు, రజక సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

చీఫ్ వార్డెన్‌గా ఈశ్వర్‌కుమార్ నియామకం



ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఈశ్వర్‌కుమార్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల అసోసియేట్ డీన్‌గా ఏయూ ఫార్మసీ కళాశాల ఆచార్యుడు కె.ఈశ్వర్‌కుమార్ నియమితుడయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ నుంచి ఆయన శనివారం ఉత్తర్వులు స్వీకరించారు. అనంతరం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయ రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆదర్శం సావిత్రిబాయి పూలే



పూలే వయోజయ విద్యా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమణమూర్తి

మద్రిపాలెం: దేశ తొలి ఉపాధ్యాయిని, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలేను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని లీడర్ పత్రికా సంపాదకుడు వి.వి.రమణమూర్తి అన్నారు. ఆర్ అండ్ బీ దరి ఏకలవ్య కాలనీలో మురికివాడల నివాస సంఘం, ప్రగతి శీలా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే వయోజన విద్యా కేంద్రాన్ని శనివారం ముఖ్య అతిథిగా ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన అభినందన సభలో రమణమూర్తి మాట్లాడుతూ అనేక పోరాటాలతో భూకబ్జాదారుల దాడులు, దౌర్జన్యాలపై పోరాడి నివాస హక్కును సుస్థిరం చేసుకుంటున్న ఏకలవ్య కాలనీవాసులను అభినందించారు. మరో అతిథి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ యువత చెడు మార్గం నుంచి బయటపడి విజ్ఞానవంతులని కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చైతన్య మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లలిత, విద్యా పరిరక్షణ కమిటీ కిషోర్, సీపీఐ ఎంఎస్ న్యూ డెమోక్రసీ ఏరియా కమిటీ అధికార ప్రతినిధి వై.కొండయ్య, పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సముద్ర స్నానాలకు పోటెత్తిన భక్తులు



జోడుగుళ్లపాలెం తీరం వద్ద సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: మహాశివరాత్రి పూజలు చేసిన భక్తులతో శనివారం సాగర తీరం పోటెత్తింది. శుక్రవారం రాత్రి భక్తులు ఎక్కువమంది జాగారంతో గడిపారు. ప్రతి ఏడాది మాదిరిగా శివరాత్రి స్నానాలు కోసం ఆర్కే బీచ్ నుంచి జోడుగుళ్లపాలెం, సీతకొండ, రుషికొండ బీచ్‌ల వరకు అధిక సంఖ్యలో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. అన్ని బీచ్‌ల్లో లక్షకు పైగా భక్తులు వచ్చి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. తెన్నేటి పార్కు, జోడుగుళ్లపాలెం నుంచి సీతకొండ వరకు తీరంలో భక్తులు సందడి నెలకొంది. ఆరిలోవ, ఆదర్శనగర్, రవీంద్రనగర్, డెయిరీఫారం, పెదగదిలి, చినగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెంతోపాటు సింహాచలం, అడవివరం, వేపగుంట, పెందుర్తి తదితర ప్రాంతాల నుంచి భక్తులు ఆటోలు, ద్విచక్ర వాహనాలతో ఈ తీరాలకు చేరుకున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఇక్కడ స్నానాలకు వచ్చిన భక్తులతో సందడిగా మారింది. తీరంలో స్నానాల చేసిన అనంతరం భక్తులు ఇక్కడ ఏడుగురు అమ్మవార్ల గుడి(కొత్తమ్మవారు)లో పూజలు చేశారు. స్నానాలు చేస్తున్న సమయంలో భక్తులు సముద్రంలో లోపలకు వెళ్లకుండా ఆరిలోవ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది జాగ్రత్త చర్యలు చేపట్టారు. ప్రతి 10 మీటర్ల దూరంలో ఇద్దరేసి చొప్పున పోలీసులు విధులు నిర్వహించారు. గజ ఈతగాళ్లను, పడవల్లో కెరటాలకు కొంత దూరంలో నీటిలో సిద్ధంగా ఉంచారు. సముద్ర స్నానం చేయడానికి పెద్దలతోపాటు వెళ్లిన చిన్నారులు సరదాగా గడిపారు.

వైభవంగా దుర్గాలమ్మ జాతర



దుర్గాలమ్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న జాతర నిర్వాహకులు, భక్తులు

దాబాగార్డెన్స్ : పూర్ణామార్కెట్ దరి వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం జాతరను పురస్కరించుకుని ఆలయానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత అమ్మవారికి వైభవంగా నేత్రోత్సవం, తొలిపూజ నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భవానీ మాలలు వేసిన మాతలు కలశాలతో పసుపు కుంకుమ నీళ్లతో ఊరేగింపుగా ఆలయానికి విచ్చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో అగ్నిగుండాలు తొక్కే కార్యక్రమం జరిపారు. సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవాలు శనివారంతో ముగిసాయి.

16న మారువారం..

అమ్మవారి మారువారాన్ని పురస్కరించుకుని ఈ నెల 16న 108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నారు. 17 మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం వద్ద ఐదు వేల మంది భక్తులకు మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: వీఆర్‌కే మెమోరియల్ సంస్థ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం సాయంత్రం జరిగిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. గాయనీ గాయకులు భాగ్యలక్ష్మి, కల్యాణి, సుజాత, లావణ్య, వెంకటేష్, రామకృష్ణ, గంగాధర్, శ్రీనివాస్ ప్రముఖ సినీ నటులు కృష్ణ, శోభన్‌బాబు నటించిన చిత్రాల్లోని పాటలు పాడి ఉత్సాహ పరిచారు.

13 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాలలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సైన్స్ విద్యార్థులకు ఈ నెల 13 నుంచి ప్రథమ, ద్వితీయ సెమిస్టర్ క్లాసులు, ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమవుతాయని అధ్యాయన కేంద్రం కో ఆర్డినేటర్ జి.రాజుకుమార్ తెలిపారు. దీనికి సంబంధించి వివరాలను విద్యార్థులకు పోస్ట్ ద్వారా పంపించామన్నారు. మరిన్ని వివరాలకు అధ్యయన కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

జీవీఎంసీ పాఠశాలలో ఎన్‌సీఈఆర్‌టీ బృందం



ప్రాథమిక పాఠశాలలో బృంద సభ్యులు

మద్దిలపాలెం: న్యూఢిల్లీ నుంచి ఎన్‌సీఈఆర్‌టీ బృందం ఇసుకతోటలోని జీవీఎంపీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం క్షేత్రస్థాయిలో పూర్వ ప్రాథమిక విద్యపై ఆరా తీశారు. ప్రాథమిక పాఠశాల తల్లిదండ్రులతో, అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పిల్లలకు భద్రతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యను అందించడంపై చర్చించారు. కేంద్రంలో వసతులు, సదుపాయాలపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ వి.వి.సింగ్, ఆధ్వర్యంలో 10 మంది సభ్యులతోపాటు, ఎస్ఐఈఎంఏటీ ప్రొఫెసర్ సుహాసిని, అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఏఎంవో జి.లక్ష్మి, ఏసీడీపీవో శ్రీలత, సూపర్‌వైజర్ సెల్వియా, ఎంఈవో కె.ఎ.బాలామణి, హెచ్‌ఎం నాగామణి, సీఆర్‌పీ రాధా, భాగ్యలక్ష్మి, గణపతి, అంగన్‌వాడీ కార్యకర్త ఈర్ల దేవి, డైట్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో ఏర్పాటు చేసిన విద్యుద్దీప స్తంభాలు

సీతంపేట: అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ విస్తరణ పనులు జోరుగా జరుగుతున్నాయి. హైవే కూడలి నుంచి మహారాణి పార్లర్ వరకు 80 అడుగుల విస్తరణ చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ నిర్మించారు. రోడ్ మధ్యలో నిర్మించిన సెంటర్ మీడియన్‌పై ఎల్ఈడీ విద్యుత్ దీప స్తంభాలు ఏర్పాటు చేశారు. దీంతో ఈ మార్గంలో రహదారి విస్తరణ పనులు దాదాపు పూర్తి కావడంతో మెయిన్ రోడ్ విశాలంగా కొత్త అందాలతో ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం మహారాణి పార్లర్ కూడలి నుంచి దొండపర్తి కూడలి వరకు 60 అడుగుల రోడ్డుగా విస్తరణ పనులు జరుగుతున్నాయి. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు తీరినట్టేనని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొండవాలులో అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కె.కె.రాజు



48వ వార్డులో పర్యటిస్తున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు శ్రీనివాసనగర్, జైభారత్‌నగర్, జవహర్‌లాల్ నగర్ కొండవాలు ప్రాంతాల్లో శనివారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు విస్తృతంగా పర్యటించారు. ఈ ప్రాంతాల్లో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మెట్ల మార్గాలు, కమ్యూనిటీ హాళ్ల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలకు నేరుగా మెరుగైన సేవలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకుడు కర్రి రామారెడ్డి, చెర్ల సత్యనారాయణ, పద్మా, పార్వతి, రాంబాబు, హేమంత్‌కుమార్, గోపి, శ్రీను, జాగారపు అప్పారావు, రామునాయుడు, పార్టీ కార్యకర్తలు, ఆయా ప్రాంతాల పెద్దలు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్‌లోకి ఆహ్వానం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వరలక్ష్మి

మద్రిపాలెం: మురళీనగర్ వాకర్స్ క్లబ్ నెలవారీ సర్వసభ్య సమావేశాన్ని శనివారం క్లబ్ సభా ప్రాంగణంలో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించారు. పర్యావరణానికి ప్రాధాన్యమిస్తూ, క్రమశిక్షణ కార్యాచరణతో కొనసాగుతున్న వాకర్స్ క్లబ్‌లో నూతన సభ్యులకు ఆహ్వానం పలుకుతున్నామని నిర్వాహకులు తెలిపారు. సీనియర్ సభ్యుల వారసులు, స్థానికులు ఎవరైనా చేరవచ్చని, క్లబ్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి న్యాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు పి.వరలక్ష్మి మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొనే న్యాయ సంబంధమైన వివాదాలపై సందేహాలు, వాటి పరిష్కారాలపై వివరించారు. వీలునామా తదితర విషయాలను తెలియజేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా వరలక్ష్మిని క్లబ్ సభ్యులు సత్కరించారు. నూతన సభ్యుల చేత వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం ప్రమాణ స్వీకారం చేయించారు. వాకర్స్ జిల్లా 101 ఎలెక్ట్ గవర్నర్ ద్వారకానాథ్ వాకర్స్ క్లబ్ మాసపత్రిక 'వాకర్స్ వాయిస్' మార్చి నెల సంచికను ఆవిష్కరించారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారి అపహరణపై ఫిర్యాదు.. ఉపసంహరణ

సీతమ్మధార: ఓ చిన్నారిని అపహరించారంటూ ఫిర్యాదు చేసిన ఘటన నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా.. రైల్వే న్యూకాలనీ శివాలయం వీధికి చెందిన మహిళ తన ఐదేళ్ల కుమార్తెను తీసుకుని శనివారం స్థానిక టిఫిన్ షాప్‌నకు వెళ్లింది. ఫోన్‌పే యాప్ ద్వారా డబ్బులు పంపడానికి ఫోన్ చూస్తున్న క్రమంలో ఆమె తన చిన్నారిని గమనించలేదు. మళ్లీ చూసేసరికి పాపను అక్కడ ఉన్న హిజ్రా చేయి పట్టుకుని తీసుకెళ్లడం గమనించి, అపహరిస్తుందనే భావనతో ఒక్కసారిగా తల్లి కేకలు పెట్టింది. దీంతో అక్కడ ఉన్న వారంతా హిజ్రాను నిలదీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో తల్లి చూసి అపార్థం చేసుకుందని నిర్ధారణ కావడంతో ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదును ఉపసంహరించుకున్నారు.